క్లుప్తంగా

ప్రకృతి సేద్యంతోనే ఆరోగ్యం



కొల్లిపర: ప్రకృతి సేద్యంతోనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి అన్నారు. మంగళవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి సేద్యం ద్వారా పండించిన వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలను మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మోడల్‌టీం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఎటు వంటి పంటలకైన మార్కెట్‌లో మంచి రేటుతో పాటు డిమాండ్ ఉందన్నారు. ప్రతి కుటుంబంలోని మహి ళలు వారి ఇంటి వద్ద ఖాళీగా ఉన్న స్థలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆకుకూరలు పండించి కుటుంబ సభ్యులకు ఆహారంగా అందిస్తే అటు వంటి కుటుంబంలో ఎటువంటి రోగాలు రాకుండా పూర్తి ఆరోగ్యవంతులుగా ఉంటారని, చదువు కొనే విద్యార్థులలో మంచి జ్ఞానశక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం సాగు చేసి జావితరాలకు మంచి ఆరోగ్యాన్ని అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సుధారాణి, ఎంటీ కుమారి, సీఆర్‌పీ పిడపర్తి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏపీపీగా ఎలిజబెత్ రాణి



తెనాలిరూరల్: పట్టణ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎలిజబెత్ రాణి జాటోతు నియమితులయ్యారు. ఇటీవలి వరకు ఇదే కోర్టు ఏపీపీగా పని చేసిన ఆమె కాల పరిమితి ముగిసింది. తిరిగి ఆమెను ఏపీపీగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జె. సుదర్శనరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఏపీపీగా సేవలు అందిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఘనంగా వాసవీ మాత వార్షికోత్సవం

చెరుకుపల్లి: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి 13వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం, కుంకుమపూజ, పట్టు వస్త్రధారణతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం లలితా పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు యెండూరి మధుసూదనరావు, కార్యదర్శి చందలూరి గోపి, కోశాధికారి యెండూరి రాఘవేంద్రరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రగతి శీల కార్మిక సమైఖ్య రాష్ట్ర క్యాదర్శి కొండారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట ఆటో యూనియన్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఆటో యూనియన్ అధ్యక్షులు శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు బీజేపీ ప్రోత్సహిస్తోందని అన్నా రు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించి 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మిక వేతనం 26 వేలు చేయాలని, తదితర డిమాండ్లతో ఈనెల 16వ తేదీ నిర్వహించనున్న సమ్మెకు కార్యకర్తలు, ఆటోడ్రైవర్లు, యూనియన్ నాయకులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాజశేఖర్, ఆటో యూనియన్ బాధ్యులు ఎస్.కె.సైదా, కె.బాలు, కోటిరెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

దుగ్గిరాల ఇసుక రీచ్‌ల పరిశీలన



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కృష్ణాతీరంలోని పలు ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ రవిబాబు మాట్లాడుతూ దుగ్గిరాల మండల పరిధిలోని కృష్ణాతీరం వెంబడి గొడవర్రుతో పాటు పలు ప్రాంతాల్లో ఇసుకరీచ్‌పై అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని పలు ఆరోపణలు వస్తున్నాయని, రాత్రి సమయంలో కూడా రెవెన్యూ, పోలీస్ శాఖ వారు ఉమ్మడిగా తనిఖీలో చేస్తారని చెప్పారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తుంటే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశీలనా కార్యక్రమంలో దుగ్గిరాల ఎస్ఐ ప్రతాప్ కుమార్‌తో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీలతవాణి, డీడీఏ రామాంజనేయులు

తెనాలిటౌన్: రూరల్ మండలం హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లోని పంట పొలాలను మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పరిశీలించారు. హాఫ్‌పేట, ఖాజీపేట పెసర, కొలకలూరులో మొక్కజొన్న, నందివెలుగులో జొన్న పంటలను సందర్శించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శ్రీలత వాణి, జిల్లా వనరులు కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ పి.రామాంజనేయులు, తెనాలి ఏడీఏ ఎస్.ఉషారాణి, ఏవో జి.ప్రేమ్‌సాగర్‌లు పంటలను పరిశీలించారు. శాస్త్రవేత్త శ్రీలతవాణి మాట్లాడుతూ పెసరలో ఆకుముడత, బొబ్బర లాంటి వైరస్ తెగులును గమనించామన్నారు. నివారణకు స్పైవోసాడ్ 60 మి.లీ లేదా ఏసిపీటీ 200 గ్రాముల మందు ఎకరం పైరులో పిచికారీ చేయాలన్నారు. జొన్నలో గులాబి రంగు, మచ్చల కాండం తొలుచు పురుగు ఉనికిని గమనించామని, నివారణకు కాంజిన్ 60 మి.లీ ఎకరం పైరులో పిచికారీ చేయాలని సూచించారు. డీడీఏ రామాంజనేయులు మాట్లాడుతూ మొక్కజొన్నలో బాక్టీరియా కాండం కుళ్ళు తెగులు అక్కడక్కడా గమనించామన్నారు. బ్లీచింగ్ పొడి 10 గ్రాములు లీటరు నీటికి కలిపి తెగులు సోకిన మొక్కలు, వాటి చుట్టు ప్రక్కల మొక్కలను మొదళ్లలో నేల తడిచే విధంగా పోయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో మోహన్, వీఏఏలు వంశీ, నాగేంద్ర, నాగరాజు, శివసాయి, తేజ, మౌనిక, రైతులు పాల్గొన్నారు. అనంతరం కొలకలూరు-1 రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలపై రైతులకు ఉన్న సందేశాలను నివృత్తి చేశారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎన్ఆర్ఐ ప్రభంజనం



మంచిఫలితాలు సాధించిన విద్యార్థులతో సీఈవో ఉమామహేశ్వరరావు

తెనాలిఅర్బన్: జెఈఈ మెయిన్స్ ఫేజ్-1 ఫలితాల్లో తెనాలిలోని ఎన్ఆర్ఐ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని ఎన్ఆర్ఐ విద్యాసంస్థల సీఈవో ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలో బుధవారం మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జె.జగన్నాధ సూరి 99.85, ఎం.రోహిత్ 99.81 మార్కులు సాధించినట్లు చెప్పారు. అలాగే 44 మంది 90 శాతం మార్కులు సాధించారని చెప్పారు. త్వరలో జరగనున్న జెఈఈ అడ్వాన్స్‌లో కూడా తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపల్ శ్రీమన్నారాయణ, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు కిషోర్, స్కూల్ డీన్ కిషోర్‌బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లాజర్స్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



బాధితులకు నగదు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు నాగదేవిక, కౌన్సిలర్ దుబాయ్‌బాబు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఈ నెల 10న జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు కుటుంబాలకు మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు బాధితులైన షేక్ మాగ్బూల్ కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు నాగదేవిక, కాలిశెట్టి ఫణీకుమార్, మున్సిపల్ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు నగదు అందజేశారు. ఇళ్లు కోల్పోయిన వారికి పార్టీ అండగా ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లవరపు బుల్లయ్య, ప్రసాదం సురేష్, వీరమల్లు కార్తికేయ, అక్కిదాసు కిరణ్ కుమార్, షేక్ ఖాజావలి, కోలంటి దాసు, షేక్ అజ్గర్, భరత్, వీఆర్వో సురేష్, అమీర్‌బాషా, ఉన్నం రాజేంద్ర పాల్గొన్నారు.

బండ్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



గౌరీదేవి అలంకారంలో పూజలు అందుకుంటున్న బండ్లమ్మ

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్రా శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడవారికి శీఘ్రంగా వివాహం జరుగుట కొరకు హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పసుపు కొమ్ములతో నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా బండ్లమ్మ వారిని మహాగౌరీ దేవిగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న స్వర్ణకారుల సంఘం

తాడేపల్లిరూరల్: స్వర్ణకారుల సంక్షేమం కోసం స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మంగళగిరి పట్టణానికి చెందిన స్వర్ణకారులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ స్వర్ణకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, గుంటూరు జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ మాట్లాడుతూ స్వర్ణకారులకు ఇప్పటి వరకు పట్టించుకున్న నాథుడే లేరని చెప్పారు. స్వర్ణకారుల బతుకు భద్రం కరువైందని, ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ప్రకటించారని, ఆ ప్రకటనను చేసే తలతో పాటు స్వర్ణకారులు కూడా ఎంతో సంతోషించారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్వర్ణకారుల జీవితాల్లో మార్పు వస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్వర్ణకారులు కొల్లి లక్ష్మీ గిరిధరరావు(గిరి), దామర్ల నారాయణ, మునగపాటి రఘు, మంద్రు సత్యనారాయణ, తిరువీధుల కిరణ్ పాల్గొన్నారు.

పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శివశంకరరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం దుగ్గిరాల టర్మరిక్ అసోసియేషన్ హాల్‌లో అగ్నిప్రమాద బాధితుల కమిటీ సమావేశం కాజా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతనెల 19వ తేదీన కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగినా ఇంత వరకు ఎంత స్టాక్ ఉంది, ఎంతమంది రైతులు నష్టపోయారు, బీమా వివరాలు తదితర అంశాలు ఇప్పటి వరకు బయటకు రాకపోవడం విచారకరమని అన్నారు. ప్రస్తుతం పసుపు మార్కెట్ విలువ క్వింటా ధర 11,900 రూపాయలు పలుకుతోందని, ఈ ధర ప్రకారం ఇన్సూరెన్స్ ఇవ్వాలని, ఏదైనా వ్యత్యాసం ఉంటే కోల్డ్ స్టోరేజ్ యజమాని ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం తెనాలి సబ్‌కలెక్టర్ నియమించిన ఎంక్వైరీ కమిటీ చైర్మన్‌ను కలవాలని సమావేశం నిర్ణయించిందని అన్నారు. సమావేశంలో బాధితుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య, ములకా శివ సాంబిరెడ్డి, బాలరాజు, వై. బ్రహ్మేశ్వరరావు, యోగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, చంద్రశేఖర్, వెంకట అప్పారెడ్డి, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా బాబా ఆలయ వార్షికోత్సవం

బాపట్ల: బాపట్ల పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో వేంచేసి యున్న షిరిడీ సాయిబాబా దేవాలయంలో 28వ వార్షికోత్సవ సందర్భంగా అఖండ దీపస్థాపన ఉత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. గుండ్రెడ్డి శివ, అనురాధ దంపతులు ఈ ప్రత్యేక దీపస్థాపనలో పాల్గొన్నారు. భక్తులు భారీగా పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల షిరిడీ సాయిబాబా ఆలయ సేవా సమితి అధ్యక్షులు కె. రాజ్యలక్ష్మీ, సెక్రటరీ ఉప్పాల వీరయ్య, బలగాని బాలకృష్ణుడు, ఉడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

16న సూర్య నమస్కారాల పోటీలు

తెనాలి: రథసప్తమిని పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన యోగ భారతి, క్రీడా భారతి సంయుక్త ఆధ్వర్యంలో బాలబాలికలకు నాలుగు కేటగిరీల్లో సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించనున్నారు. కన్వీనర్ ప్రభల మల్లికార్జున శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు తమ తమ పాఠశాలల ద్వారా పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. కార్యక్రమాన్ని 10 నిమిషాల ముందు తమ పేర్లు నమోదు చేసుకుని పాఠశాల యూనీఫాంతోనే పోటీల్లో పాల్గొన వచ్చని తెలిపారు. వివరములకు 9490875076, 9985423196 సంప్రదించాలని కోరారు.

మహాప్రస్థాన సేవాసమితికి రూ.లక్ష వితరణ



తెనాలి: పట్టణానికి చెందిన శాఖమూరి శ్రీనివాసరావు, ఆయన కుమార్తె కొడాలి నగరాజ కుమారి తెనాలి మహాప్రస్థాన సేవా సమితికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. తన తల్లిదండ్రులు శాఖమూరి రాఘవయ్య-భాగ్యశ్రీ జ్ఞాపకార్థం మహాప్రస్థానం అభివృద్ధికి ఈ వితరణను చేపట్టినట్లు శ్రీనివాసరావు తెలిపారు. సేవాసమితి అధ్యక్షుడు దాకా సాంబిరెడ్డి, కార్యదర్శి జెట్టి శివ రామకృష్ణప్రసాద్, కోశాధికారి తుమ్మల బాపయ్య చౌదరికి మంగళవారం రూ.లక్ష చెక్కును ఆయన అందజేశారు. కన్నెగంటి బాపనయ్య, మండవ ధనుంజయరావు, రావెళ్ల వెంకటాద్రి, కొడాలి అప్పారావు పాల్గొన్నారు.

నేడు అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం

హాజరు కానున్న ప్రముఖులు



వేమూరు: చుండూరు మండలంలోని నడిగడ్డపాలెం ఎస్టీ కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో చేపట్టిన అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం బుధవారం జరగనుంది. ఉదయం 11-14 గంటలకు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా ఆలయంలో ఉత్సవ మూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అయోధ్య రామాలయం నిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున, నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు పాల్గొంటారని చెప్పారు.

నేడు భావనరుషి స్వామి కల్యాణ మహోత్సవం

తాడేపల్లిరూరల్: శ్రీ భద్రావతి సమేత భావనఋషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు బహూత్తమ సేవా సంఘం అధ్యక్షుడు వూట్ల సాంబశివరావు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత మంగళగిరి శ్రీ భద్రావతి సమేత భావనరుషి స్వామి కల్యాణ మండపంలో వేడుక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం స్వామిని పెండ్లి కుమారి ఉత్సవం, రాత్రి 9.01 స్వామి వారి కల్యాణం జరిపించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని తెలిపారు. భారీ అన్నదానానికి ఏర్పాట్లు చేశామని వివరించారు. సమావేశంలో సంఘ నాయకులు గంజి లక్ష్మయ్య, వూట్ల వెంకట సాంబశివరావు, ఉద్దంటి గాంధీ, రామనాథం కృష్ణ, వూట్ల నరసింహారావు పాల్గొన్నారు.

సుందర తెనాలి కలను సాకారం చేసేందుకు కృషి

మున్సిపల్ చైర్మన్ రాధిక



మురుగు కాల్వల పూడికతీత పరిశీలిస్తున్న రాధిక

తెనాలిఅర్బన్: సుందర తెనాలి కలను సహకారం చేసేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతిరోజు మురుగు కాల్వలను బాగు చేయించాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట కౌన్సిలర్ అన్నం పిన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కావేటి ఈశ్వర్, తాడిబోయిన రమేష్, బ్రదర్ ఆనందన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఆర్ఐ కుర్రా శ్రీనివాసరావు, ఏఈ చైతన్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

బీజేఆర్ కమిటీ డిమాండ్



డీఎస్పీ జనార్ధనరావుకు వినతిపత్రం అందజేస్తున్న సురేష్, శ్యామ్, శరత్, దేవన్న

తెనాలిరూరల్: దళితులపై అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు చేస్తున్న దాడులను పోలీసులు అరికట్టాలని బాబు జగ్జీవన్‌రామ్(బీజేఆర్) కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఇటీవల తాడేపల్లి మండలం చిర్రావూరులోని దళిత రేషన్ డీలరుపై అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణానికి చెందిన వారు దాడికి పాల్పడ్డారు. ఈ కేసు విచారణాధికారిగా తెనాలి డీఎస్పీ బి. జనార్ధనరావును ఉన్నతాధికారులు నియమించారు. ఈ నేపథ్యంలో బీజేఆర్ కమిటీ సభ్యులు మంగళవారం డీఎస్పీని ఆయన కార్యాలయంలో కలిశారు. ఇటీవలి కాలంలో దళితులపై జరుగుతున్న దాడులను డీఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. కేసును నిష్పక్షపాతంగా విచారించి బాధితుడికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసులో ప్రభుత్వం తరపున అందే సాయం బాధితుడికి త్వరగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరుగకుండ పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్తోట శ్యామ్, ఆత్తోట శరత్, కొవెవరపు దేవన్న అత్తోట చంటి, కొమ్ము రాయల్, సీనియర్ న్యాయవాది ఇందుపల్లి రాజారామ్, నలుకుర్తి రమేష్, జి. రవి తదితరులు డీఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

గణపతి స్వామి వారికి అన్నాభిషేకం



అన్నాభిషేకం అనంతరం దర్శనమిచ్చిన సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారు

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన ప్రథమ పూజాధిపతి సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారి బ్రహ్మోత్సవాలు నేత్రానందంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వార్లకు మహన్యాస పూర్వక ఏకాదశ వార పంచామృత అభిషేకాలతో పాటు అన్నాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 15న జరుగనున్నది. దేవస్థాన ధర్మకర్త, విశ్రాంత హైకోర్టు న్యాయవాది తాడికొండ శేషగిరిరావు ఆధ్వర్యంలో పంచాహ్నిక దీక్షతో ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. స్వామి వారి కల్యాణ మహోత్సవాలే వెల్లటూరు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ఈ తిరునాళ్ల ప్రారంభమయ్యాకనే చుట్టుపక్కల ప్రాంతాలలో తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతాయి. దేవాలయ ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరామచంద్ర మూర్తి, తమిరిశ మారుతి, క్రోవి రామకృష్ణల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

బుధవారం ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన, సామూహిక సువాసినీ పూజ, రాత్రి స్వామి వారి ఊయల సేవ అనంతరం శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. గురువారం లక్ష్మీ గణపతి హోమం, రాత్రి స్వామి వారి దివ్యరథోత్సవం, శుక్రవారం వసంతోత్సవం, శ్రీదేవి భూదేవి సమేత ఆదిశేషాచల స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు.

ఘనంగా మాతా రమాబాయి వర్ధంతి



పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

బాపట్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి మాతా రమాబాయి 126వ జయంతి సందర్భంగా అంబేడ్కర్ భవనంలో మంగళవారం 'మాల పేరంటాల పెళ్లి నలుగు' పాటల పోటీలను మంగళవారం నిర్వహించారు. మాల మహాసభ, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో 14 టీములు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొన్న ప్రతి టీంకు ప్రోత్సాహకంగా రూ.1,500లు నగదు అందజేశారు. గణపవరం, ప్యార్‌లీపాడు, మూలపాలెం, చింతవారిపాలెం, నరసాయపాలెం, హైదర్‌పేటకు చెందిన వారు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మాల మహాసభ వ్యవస్థాపకులు, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు మల్లెల వెంకటరావు, జి. లజపతిరాయ్, ఎంద్రపాటి అశోక్, నక్క భాను, దగ్గుమల్లి కిరణ్ కుమార్, శ్రీమతి అడే బుజ్జి, గొర్రుముచ్చు వందనం, చల్లపల్లి కోటేశ్వరరావు, ఎర్ర కోటయ్య, గుదే రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అగ్రిగోల్డ్ బాధితుల న్యాయపోరాట దీక్ష

తాడేపల్లిరూరల్: అగ్రిగోల్డ్ బాధితుల కోసం న్యాయపోరాట దీక్ష ఈనెల 15వ తేదీ విజయవాడలో నిర్వహించనున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ తెలిపారు. మంగళగిరి పట్టణ పరిధిలోని వేముపల్లి శ్రీకృష్ణభవన్లో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ యాజమాన్య దోషులకు తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన తిరుపతయ్య, అగ్రిగోల్డ్ కస్టమర్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు డి.చక్రధర్ బాబు, నియోజకవర్గ కార్యదర్శి పి.కృష్ణ, కోశాధికారి గౌరీ శంకర్, సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, గోహర్ జానీ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ గంగానమ్మపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి గురవయ్య కాలనీకి చెందిన బాలు మంగళవారం ఎనిమిది క్వార్టరు సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా బస్టాండ్ సమీపంలోని స్థూపం సెంటరు వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు.సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్‌పోలీసులు తెలిపారు.